
అర్థరాత్రి మేలుకొన్న సురభికి ఏదో సందడి వినబడింది. అకస్మాత్తుగా అంతసంరంభం ఎక్కడినుంచి ఎందుకు వస్తోందో ఆమెకి తెలియ లేదు. పక్కనే రాఘవ గాఢంగా నిద్రపోతున్నాడు. కిటికీ తలుపు చప్పుడవ కుండా మెల్లిగా తెరిచింది చూద్దామని. రోడ్డుకి అవతలవైపున అవుతోంది ఆ సందడంతా. చాలామంది జనం, పిల్లలూ పెద్దలూ; ఏవేవో సరంజామా సరుకులూ చేరవేయటమూ, సర్దటమూ. టైము చూసింది. మూడు దాటు తోంది. గ్లాసెడు మంచినీళ్లు త్రాగి పడుకుంది.

# బహుమానం

## పి. శోభాదేవి



తెల్లవారి పనిమనిషికి తలుపుతీసిన సురభి ఆశ్చర్యపోయింది. ఏనాటి నుంచో అక్కడే ఉంటూ ఉన్నట్లు పిల్లలు ఆడుకుంటున్నారు. పెద్దలంతా తమతమ వ్యవహారాల్లో నిమగ్నమై ఉన్నారు. రాత్రికి రాత్రి అక్కడొక కాలనీ తయారయిపోయింది. ఉండటానికి వాళ్లు ఏర్పరచుకొన్న ఆవాసాల్ని ఆవాసాలనే అనాలి. అవి ఇళ్లు కావు, గుడిసెలు కావు, డేరాలు కూడా కావు. పైకప్పుమీద వెదురుబద్దలూ తాటాకులూ ఎన్ని ఉన్నాయో, చిరిగి వాలికలై ఒకదానితో ఒకటి ముడిపెట్టబడిన చింకిబట్టలూ, ప్లాస్టిక్కు షీటులూ అవి ఎగిరిపోకుండా, విరిగిపోయిన ప్లాస్టిక్ బకెట్టు ముక్కలూ కూడా, అన్ని ఉన్నాయి. అందులోకి ప్రవేశించాలంటే వంగి నేల నానుకుని దూరాలసిందే! అక్షరాలా తల దాచుకునేందుకు చేసుకున్న ఏర్పాట్లు.

సురభి నిలబడి చూస్తూ ఉండడం ఒక స్త్రీ చూసింది. ఘల్లుఘల్లుమని చప్పుడు చేస్తూ రోడ్డుదాటి దగ్గరగా వచ్చింది. సురభి ముఖంలోని ప్రశ్నలకి జవాబుగా చెప్పింది.

''రాత్‌కో ఆయా. థోడా దిన్ యహాఁ రహతే. హమ్ లోగ్ పుతుల్ బనాతే, అవుర్, బిక్రే కర్తే. దేఖో వహాఁ..... '' కళ్లతో చూపించింది.

సురభి చూసింది, రోడ్డు కవతలవైపున. రకరకాల దశల్లో ఉన్న బొమ్మలు. దాదాపు పూర్తి అయినవీ, ఇంకా మొదట్లోనే ఉన్నవీ, రూపురేఖలు దిద్దుకుంటున్నవీ, కొన్నిమట్టివి, కొన్ని ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేయబడినవీ... హిందీ నుండి తెలుగులోకి మారిపోయింది ఆ స్త్రీ.

''రాత్రే దిగామమ్మా! ఇంత గంజికాచాను, ఏదైనా కాస్తంత పచ్చడిపెట్టు. నాలిక్కి రాసుకునేందుకు'' అడిగింది.

రాత్రి మిగిలిన బీరకాయపచ్చడి తీసుకొచ్చి, ప్లాస్టిక్ కవరు మీద వేసి ఆమెకిచ్చింది సురభి.

ఆఫీసుకి బయల్దేరి బయట అడుగుపెట్టిన రాఘవ ముఖం చిట్లించుకున్నాడు. తమ యింటి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలోని జన సమ్మర్దాన్ని చూసి. అతని ఉద్యోగం మునిసిపల్ ఆఫీసులో.

మధ్యాహ్నానికల్లా వాళ్లు ఆ రోడ్డు పక్కన పూర్తిగా స్థిర పడ్డారు.

సురభి రాఘవ భార్యాభర్తలు.

పెళ్ళై ఇరవైఏళ్లు అయినా పిల్లలు పుట్టలేదు. సురభికి చాలాలోటుగా ఉంటుంది. పదిమందిలోకి వెళ్ళవలసి వచ్చినప్పుడు, ఆ లోటు మరీ బాధ పెడుతుంది. తను పనికిమాలిన దానినన్న భావం మనసులో మెద లుతూ ఉంటుంది. రాఘవకి మాత్రం అటువంటి దేమీ లేదు.

''పోనిద్దూ, పిల్లలున్నవాళ్లు మహా సుఖపడిపోతు న్నారా ఏమైనా? పిల్లల వల్ల ఎన్ని సమస్యలు! అవేమీ లేవని సంతోషించకుండా.ఎందుకొచ్చిన చింత?'' అని అంటూ ఉంటాడు. తనతో పాటు అతనూ విచారించా లని సురభి అనుకుంటూ ఉంటుందేమో, అతను అంటున్న మాటలు ఆమెకేమీ సాంత్వన కలిగించవు. మైనెస్‌ని మైనస్‌తో గుణిస్తే ప్లస్ అయినట్లు ఇద్దరు కలిసి విచారిస్తే అందులో దుఃఖం పాలు తగ్గుతుంది కదా!

సురభికీ రాఘవకీ చాలావిషయాలలో భావనా భేదం ఉంది. ఆమెది సున్నితమయిన భావుకతా హృదయం. దాన్ని గుర్తించటం మాట అటుంచి, అదే మిటో అర్థం కూడా కాని మనిషి రాఘవ. అయితే అతను చెడ్డవాడు కాదు. అందుకే వాళ్లిద్దరూ కాపురం చేసుకుంటూ ఉండగలిగి నంత సుఖంగా ఉంటు న్నారు.

ఆమె తన జీవితంలో ఏర్పడిన లోటు మరచిపోవ టానికి రకరకాల పద్ధతులలో ప్రయత్నిస్తూ ఉంటుంది. అయిదారుగురు బీదపిల్లల్ని చేరదీసి చదువు చెబుతుంది.

''ఊరికే కంఠశోష ఎందుకు? ఎంతో కొంత వాళ్లి వ్వగలిగినంత ఫీజు తీసుకోరాదా!'' అంటాడు రాఘవ.

***

సూర, ఆమె తండా అక్కడికి వచ్చి చేరినప్పటి నుండి సురభికి మంచి కాలక్షేపం అవుతోంది. పని లేనప్పుడల్లా వీధి గుమ్మంలో నిలబడితే – వాళ్ల పని తీరువా దైనందిన కార్యకలాపాలూ కనబడుతూ ఉంటాయి. గంటలు నిమిషాల లాగా గడిచిపో తాయి. ఎర్రమట్టి, రాగిడిమట్టి పాళ్లల్లో కలుపుతారు. దాన్ని మెత్తగా మర్దించి తడుపుతూ ఆరబెడుతూ పాకానికి తెస్తారు. కొన్ని బొమ్మల్ని చేత్తోటే రకరకాల ఆకారాలలోకి మలుస్తారు. గుర్రాలూ ఏనుగులూ లేళ్లు వంటి జంతువులు, చిలకలూ నెమళ్లూ లాంటి పక్షులూ మహాసులువుగా వాళ్ల చేతుల్లో రూపుదిద్దు కుంటాయి.

బాలకృష్ణుడు కుండలో నుండి వెన్నదొంగిలిం చటం, రాధాకృష్ణుల ప్రతిమలు, కృష్ణుడు ఆవునానుకొని మురళివాయిస్తూ ఉన్న బొమ్మ – ఇలాంటి ్గతరమయిన బొమ్మలు చెయ్యాలంటే మొదట ఎ డినుంచో ఆ బొమ్మని తెస్తారు. దానికి మూ తయారుచేస్తారు. ఆ మూసలో ప్లాస్టరు ఆఫ్ ప స పేస్టునింపి అటువం టివే బొమ్మలు డజన్లకొద్దీ హూరు చేస్తారు. ఆరిపో యిన తరవాత బొమ్మని మూసనుంచి వేరుచేసి అద నంగా ఉన్న పొడరుని చాకుతో చెక్కుతూ తొలగి స్తారు. వాళ్లు చెక్కే విధానం చూస్తూ ఉంటే, సురభికి కంగారుగా ఉంటుంది. ముక్కులూ, నగిషీలూ విరిగి పోతాయేమోనని. ''విరిగిపోతే ఏమమ్మా? మళ్లీ సరి చేసుకోవచ్చు'' అంటూ కాస్తంత ప్లాస్టరాఫ్ పారిస్ ముద్దను తీసుకుని విరిగిన భాగాలని మళ్లీ అమరు స్తుంది సూర. చూస్తూ ఉన్న సురభికి గొప్ప కళా ప్రావీ ణ్యత అనిపించినా ఆ బొమ్మల వాళ్లు మాత్రం అతి సులువుగా ఆ పని చేసుకు ంూ పోతారు. తరువాత రంగులు వేస్తారు.

వాళ్ల దగ్గర మొత్తం మూడో నాలుగో రంగులుం టాయి. వాట్లతో వాళ్లు తయారుచేసే రంగుల ఛాయలు లెక్కలేనన్ని! సురభికి అబ్బురం, ఏ పాఠశా లలోనూ చదువుకు నోచుకోని వారి అభినివేశానికి. చూడగా చూడగా ఆమెకి అర్థమయింది. తాత ముత్తా తల నుండి ముందు తరాల వారికి ఎంత అలవోకగా, ఏ విధమయిన సాధనా అవసరం లేకుండానే, ప్రతి రోజూ చూస్తూ ఉన్నంత మాత్రాన ఈ నేర్పులు ఎలా అలవడుతాయో!

ఆ తండాలోని పిల్లలు కూడా యధాశక్తి బొమ్మలు చేస్తూ రంగులు వేస్తూ వ్యాూ తగ్గ సాయం చేస్తూ ఉంటారు. అదే సహాయం, ే శిక్షణా కూడా. కాస్త ఇటూ అటూ అయినదంతా పెద్దవాళ్లు సరిదిద్దుతారు.

ఆ పిల్లలు మట్టిలో ధూళిలో రకరకాల మాలిన్యా లతో మునిగి తేలుతూ కిందా మీదాపడి కేరింతలు కొడుతూ ఆడుకుంటూ ఉంటారు. వారిని చూస్తూ సురభి అనుకుంటుంది. ''ఈ సూక్ష్మాణు సిద్ధాం తాలూ, ఆరోగ్య శాస్త్ర నిర్ణయాలు వీట్లలో ఉన్న నిజం ఎంతమాత్రమో!'' అని. అవన్నీ నిజమే అయితే వీళ్లెలా బ్రతికి ఉన్నారు? ఎలా పెద్దవాళ్లవుతున్నారు? పని పాటూ లెలా చెయ్యగల్గుతున్నారు? వాళ్ల జీవ చైతన్యం అన్నింటినీ అతిశయించినదన్నమాట! ''ఆహా'' పైకే అనుకుంది.

వారికి ఖరీదైన బట్టలు లేవు. ఆధునికమైన ఆట వస్తువులు లేవు. అయినా ముఖాల మీద ఆనందం కొట్టవచ్చినట్లు కనబడుతూ ఉంటుంది. ఒకళ్ల మీద ఒకళ్లు పడుతూ లేస్తూ శీతతాపాల నుంచి సరియైన రక్షణ అయినా లేని, వాళ్లకి ఆ ఆనందం ఏమిటో!

బాల్యమే అటువంటి మధురమైన దశ. తమ జీవి తంలో గడిచిపోయిన ఆ దశని సంతానంలో పునర్వీ క్షించటం, పర్యవేక్షించటం కూడా పిల్లలు గల వారికి సృష్టిస్థితి శీలమైన ప్రాణశక్తి ఇచ్చిన వరప్రసాదాలు! సురభి ఆలోచనలకి ప్రయత్నపూర్వకంగా ఆనకట్ట వేసింది.

''అమ్మా! రా..'' పిలిచింది సూర.

ఎందుకో అన్న కుతూహలంతో వీధి తలుపు చేర వేసి రోడ్డు దాటి వెళ్లింది.



సూర తను అప్పుడే రంగులువేసి ముగించిన సీతారాములు బొమ్మ చూపించింది. ఎక్కడ సంపాదించిందో కాని నమూనాల్ని, అందంగా తయారైంది. రాముడు ధనువు చేత పట్టుకుని కూర్చున్నాడు. సీతమ్మ నిలబడి వేలితో అల్లంత దూరంలోని లేడిని చూపిస్తోంది. ఒక పొసలో చిన్నలేడి. విడివిడిగా బొమ్మలు తయారువేసి ఒక దిమ్మమీద నేర్పుగా అమర్చింది. రాముడు కూర్చున్న అరుగు ఒక చెట్టు మొదట్లో ఉంది. ఆ చెట్టుకూడా అరుగు వెనుక ఆకుపచ్చ రంగులో అందంగా కనబడుతోంది.

సురభి ఆ బొమ్మనీ సూరనీ మార్చిమార్చి చూసింది. ''ఈ ప్రపంచ నిర్మాత ఎలా ఉంటాడో!'' అనుకుంది.

అందంగా పరిశుభ్రతకి ప్రతీక అన్నట్లుంటాడా?

నవరత్న ఖచిత సింహాసనారూఢుడై కనుసన్నలతో మనోకామనల్ని ఈడేర్చుకుంటూ విలాసాల్లో మునిగి తేలుతూ ఉంటాడా? లేక తనలోని సృజనార్తిని, సహజ ప్రేరణలనీ ఆకలి దప్పుల్ని తృప్తి పరచుకొనేందుకు నిప్పునీ నీటిని గాలినీ నేలనీ పలువిధాల పాళ్లలో మిశ్రమాల్లో కలగలుపులు చేస్తూ, గుణిస్తూ భాగిస్తూ ప్రయోగాలు చేస్తూ....

కక్ష్యనివీడి దూసుకుపోబోయిన ఆలోచన మళ్లీ భూమిని చేరింది.

''చూడు! సూరా, ఇదంతా జరిగినప్పుడు సీతారాములు ఒక పర్ణశాలలో ఉన్నారు. అది కూడా ఈ బొమ్మలో ఉంటే బాగుంటుంది కదా!'' అంది. తన ముఖంలోకి చూస్తూ ఆలోచిస్తున్న సూరతో మళ్లీ అంది, ''పత్తాసే బనాయాగయా ఘర్. ఉస్కోభీ బనాతే వో పేడ్ కే థోడా పీఛే రఖ్‌దో, బహుత్ అచ్ఛా హోగా...'' రాజస్థానీకు చెందిన ఆ స్త్రీకి తెలుగుకంటే హిందీ బాగా అర్థం అవుతుందనుకుంది.

''తెలుగూ బాగానే వచ్చును, నాకు. ఏడాదికోమాటు దేశం వెళ్లి వస్తాం, అంతే. ఈ హైదరాబాద్‌లోనే మా బతుకులు ఎక్కువ భాగం... నువ్వు చెప్పిన దాని గురించే ఆలోచిస్తున్నా..'' అంది సూర.

నాలుగురోజుల్లో సురభి మనసులో ఉన్న బొమ్మ సూరచేతుల్లో అందంగా రూపుదిద్దుకొని ప్రత్యక్షమయింది. ఒకే మట్టిదిమ్మ మీద ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన సీతారాముల బొమ్మలూ, మట్టితో చేసిన చెట్టూ లేడీ బొమ్మలూ మట్టీ వెదురు పుడకలతో చేసిన పర్ణకుటీరం – ఆ నేర్పుకి సురభి ముగ్ధురాలైంది. అలాంటివి డజన్ల కొలదీ తయారయ్యాయి. ఫుట్ పాతంతా నిండిపోయింది, వాటితో. అవన్నీ అమ్ముడుపోతే బాగుండును అనుకుంది సురభి.

వాళ్ల మార్కెటింగ్ పద్ధతి కూడా ఆమెకి వింత గొలిపేది. ''ఈ బొమ్మ ఎంత?'' అని అడిగిన వాళ్లకి ఒక్కళ్లకి ఆరువందలని చెబుతారు. ఇంకొక్కళ్లకి రెండు వందల యాభై అని చెప్తారు. ఎక్కడో బేరం మొదలవుతుంది. అమ్మే వాళ్ల ఆకల్నిబట్టి ఎంతకో ఒకింతకీ అమ్ముడవుతుంది.

''అదేమిటి సూరా! అంత అందమైన బొమ్మల్ని ప్రాణం పెట్టి చేసిన వాట్లని అంత తక్కువకి అమ్మేశావేమిటి?'' అంటే ఆమె అంటుంది.

''ప్రాణం పెట్టి చేసేందుకు మా ప్రాణాలు నిలుపుకోవాలి కదా, అమ్మా!'' ఒకనాడు పచ్చడికోసం వచ్చినప్పుడు చాలాసేపు కూర్చుంది. ''నువ్వు చెప్పినట్లుగా చేసిన బొమ్మలు బాగా అమ్ముడవుతున్నాయని'' చెప్పింది.

''ఇంకా ఏమన్నా ఇలాంటి ఆలోచనలు చెప్పు'' అడిగింది. సురభికి ఉత్సాహం కలిగింది. కాస్త ఆలోచించింది. తన దగ్గర ఒక ఇత్తడి విగ్రహం వుంది, కాళీయ మర్దనుని ప్రతిమ. కాళీయ సర్పపు పడగలూ, వాటిపై నృత్యపు భంగిమలో మురళిచేతిలో ధరించిన బాలకృష్ణుడూ... ఆ బొమ్మ తెచ్చి ''ఇలాంటివి చెయ్యగలరా?'' అని అడిగింది.

''ఓ!... అయితే దీనికి మూస చెయ్యటానికి కాస్త టైం పడుతుంది. దీని కంతా రబ్బరు మైనం పూయాలి. ఆరిపోయిన తరవాత మళ్లీ పూయాలి. అలాగ అరడజను మార్లు పూసేక వెనకభాగంలో నిలువుగా కోసి బొమ్మ నుంచి మూస ఊడ తియ్యాలి. కనీసం రెండు మూడు రోజులైనా ఇది మాదగ్గర ఉంటుంది. సరేనా మరి?'' అడిగింది. ఉత్సాహం సంతోషం ఆశ కలిసిన స్వరంతో.

కాదనటం ఎలాగ? అదీకాక బొమ్మ చూపించి ఆశ పెట్టినది తనే కదా! రాఘవ ఒప్పుకోడు, అసలెందుకీ విషయం రాఘవ వరకూ వెళ్లాలి? అని ఆలోచించి సూర చేతికిచ్చింది ఆ బొమ్మని. మహాసంతోషంగా అందుకుంది సూర.

''రబ్బరు మైనం అంటే ఏమిటి సూరా?'' అడిగింది సురభి.

''అది ఒక సీసాలో ఉంటుంది. రాజస్థాన్ నుంచి తెప్పించుకుంటాం. గాలి తగిలితే గట్టిపడి పోతుంది. అందుకని కాస్త కాస్త చొప్పున ప్రమిదలోకి వంపి బ్రష్‌తో బొమ్మకి పూయాలి అంతటా కలిసేటట్లు. మొదటి దశ పూత శ్రద్ధగా కుశలంగా చెయ్యాలి. తరవాతవి ఆషామాషీగా చేసినా ఫరవాలేదు, ఆ... నీ బొమ్మేం పాడవదు; అసలు దానికేమీ అంటుకోదు...''

సురభి ఆమెవైపు మెచ్చుకోలుగా చూసింది. చక్కటి తెలుగు మాట్లాడి నందుకూ, ఇంకా చక్కగా తన మనసు చదివినందుకూ కూడా.

చాలాకాలం నుంచీ తెలుగుదేశంలో ఉన్నప్పటికీ యాస పట్టుకోవాలి కదా, ఈ సూర మట్టిమరుగున మాణిక్యం, మంచి ప్రతిభావంతురాలు అదృష్టం లేక పోయింది కాని, అనుకుంది.

చెప్పినట్లుగానే రెండు రోజుల తర్వాత బొమ్మ ఇచ్చేసింది. తళతళా మెరిసేటట్లు తోమి మరీ ఇచ్చింది. కాళీయ మర్దనుని బొమ్మలు కూడా బాగా అమ్ముడు పోయాయి.

తమకిచ్చిన ధరకి మూడు రెట్లు లాభంతో వాట్లని దుకాణాల్లో షో కేసుల్లో ఆకర్షణీయంగా ప్రదర్శించి అమ్ముతారని ఆ బొమ్మలు చేసే వాళ్లందరికీ తెలుసు. ఆకలీ అవసరాలూ వాళ్లకి గత్యంతరం లేకుండా చేస్తాయి.

ఒకనాడు ''నువ్వేమనుకుంటావో గాని, నీకో బహుమానం ఇవ్వాలని ఉంది. నా చేతుల్తో చేసి'' అంది సూర.

''బొమ్మలతో ఆడుకునేందుకెవరున్నారు సూరా? ఇంట్లో''.


అంచులుదాటి పొంగిపొరలిన ఈ మాట తప్ప తన జీవితంలోని శూన్యత గురించి సురభి ఎప్పుడూ మాట్లాడలేదు.

''అమ్మా, కాస్త పచ్చడి పెట్టు'' అనటం కాక తన లేమి గురించి సూరకూడా ఎప్పుడూ ఏమీ అనలేదు.

సూర పేరుకి అర్థం ఏమిటో! సుర్ అంటే స్వరం. సుర అంటే దేవత. లేక ఆమె పేరు కూడా సురభి అయ్యుండవచ్చు. నోళ్లలో నాని సూరగా మారిందేమో! సురభికీ సూరకీ మధ్య ఏర్పడిన సుహృద్భావానికి కారణం వారి పేర్లు ఒకే విధంగా ధ్వనించటం కాదు.

చిన్నవే అయినా ఏవేవో కొత్త సంగతులు చెబుతుంది సురభి. ఆధునిక విషయాల్ని వాళ్ల వృత్తిలో ప్రవేశపెడితే కొత్తప్రాణం పోసినట్లుంటుందని ఆ మేరకు సూచనలిస్తుంది.

చిన్నపరిమాణంలో సాధు జంతువుల బొమ్మలు చేసి వేదిక వంటి దిమ్మ మీద అమర్చమని చెప్పింది. అలాగే క్రూర జంతువులు, సాధారణ పక్షులూ, అసాధారణ పక్షులూ బొమ్మలు వేరేవేరే వేదికపైన పేర్చి అందంగా ఫుట్‌పాతమీద అమ్మకానికి పెట్టితే స్కూలు పిల్లల్ని ఆ బొమ్మలు బాగా ఆకర్షించాయి. అదే పద్ధతిలో కూరగాయలు, పళ్లు ముద్దొచ్చేటట్లు చిన్న



చిన్నగా బొమ్మలు చేసి సహజమైన రంగులు వేసి అమ్మకానికి పెట్టింది సూర. అవి బాగా అమ్ముడుపోవటం, పెద్దపెద్ద బొమ్మలకంటే వీట్ల మూలంగానే ఎక్కువ ఆదాయం రావటం చూసి ఆమె సంబరపడిపోయింది...

రోజురోజుకీ పెరుగుతున్న తమ నెయ్యం గురించి రాఘవతో ఎప్పుడూ సురభి చెప్పలేదు. అది అతను హర్షించే విషయం కాదని ఆమెకి తెలుసును.

అది ఒకరిమాట ఇంకొకరి నోట అందంగా పాటగా పలికినప్పుడు కలిగే స్పందన.

ఏ చేలగట్లనో ముళ్లపొదల్లో పాముల మధ్య వికసించిన మొగలి పొత్తివంటిది వాళ్ల పొత్తు.

ఈ మధ్య రాఘవకి మరీ విసుగెక్కువై పోయింది. తమ ఇంటికెదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకున్న బొమ్మల వాళ్ల మీద.

"ఆ మేళాం అక్కడ దిగినప్పటినుండీ చుట్టుపక్కలంతా కంగాళీ చేసేస్తున్నారు. ఫుట్‌పాత మీద నడవటానికీ వీల్లేకుండా ఉంది. ఆ పక్కనే ఉన్న జయవిజయ అపార్ట్‌మెంట్సులో ఉన్న వాళ్లందరూ కంప్లెయింట్స్ ఇస్తున్నారు. కాని మా వాళ్లల్లో కొందరు కక్కుర్తి పడుతున్నారు. వాళ్లిచ్చే పదోపరకో తీసుకుని మెదలకుండా ఊరుకుంటున్నారు చూసీ చూడ నట్లు. నాలాంటివాడికి పడాలి డ్యూటీ! చడీ చప్పుడూలేకుండా మకాం ఎత్తించేస్తాను" అంటున్నాడు తరచు. అతని పని తీరువు గురించి ఆమెకి బాగానే తెలుసు. ముక్కుకి సూటిగాపోయే అతని స్వభావమూ తెలుసును.

సురభి మనసు ఖేదపడింది. కలుగులు క్రిమికీటకాలకి సహజమే. వీళ్ల నెలవులు! – ఇవేనా వీళ్లకి తగినవి? ఉన్న వాళ్ళు షో కేసుల్లో అలంక రించుకునే బొమ్మలు తయారు చేసే వీళ్లకోసం జీవితం ఏమీ దాచి ఉంచ లేదా? పోనీ అలాగే అనుకున్నా ఆ కలుగుల వంటి ఇళ్లని కూడా రాఘవ సహించలేకుండా ఉన్నాడు. తలదాచుకునే నీడ కూడా లేకుండా చేస్తే వాళ్లు ఇక్కడినుంచి పోక ఇంకేం చేస్తారు? వాళ్లమీద అతనికెందుకో అంత కోపం! ఈపాటి బ్రతుకు కూడా పుట్టిన గెడ్డమీద లేకనే కదా ఇక్కడికీ ఇంకా ఎక్కడెక్కడికో పోయి బతుకుతున్నారు! ఫుట్‌పాత్ మీద తమ బిడ్డలతో సమానంగా – కాదు – అంతకంటే ఎక్కువగా చూసుకునే ఆ బొమ్మల్తో సహజీవనంచేస్తూ ఎండనీ వాననీ చలినీ వేడినీ సహజ మిత్రులుగా భావించే వీరు కూడా ప్రాణులే; బ్రతికినన్నినాళ్లు బ్రతకనీ అనే ఉదాసీన భావంతోనైనా తన భర్త వీళ్లని ఉపేక్షిస్తే బాగుండును!

ఆలోచనల్తో సతమతమైన సురభికి ఎప్పుడో నిద్ర పట్టింది.

***

పొద్దున్న తలుపుతీసిన సురభి కాళ్లకడ్డం పడినట్లుగా... అది.... వంగి జాగ్రత్తగా రెండు చేతుల్తోనూ పైకి తీసి పట్టుకుంది. ఇల్లు, బొమ్మల ప్రమాణానికి అది పెద్దదే. తాను ఇచ్చిన సూచననుసరించి తయారు చేయబడింది. ముచ్చటగా ఉన్న డాబా ఇల్లు! చుట్టూ కాంపౌండు గోడ, గేటు, గేటులోపల ఇటూ అటూ అశోక వృక్షాలు, అన్నీ ఒకే నలుచదరపు దిమ్మమీద!

సురభి దృష్టి ఎదురుగా బోసిగా ఉన్న ఖాళీ స్థలంపైన అతుక్కు పోయింది.


❋

రచయిత సెల్ నెం: 09008665210



# వస్తు గుణదీపిక





**నల్ల తుమ్మచెట్టు:** ఈ చెట్టుకి పెద్ద పెద్ద ముళ్ళుంటాయి. ఇది వగరుగా కొద్దిగా తీపిగా కూడా ఉంటుంది. దీని బెరడు కషాయం మంచి బలాన్నిస్తుంది. విరేచనబద్ధం చేస్తుంది. ఈ కషాయంతో కురుపులను కడిగితే నయమవుతాయి. దీనిలో పటిక కలిపి పుక్కిట పడితే దంతరోగాలు, చిగుళ్ళ నొప్పులు, నోటి పూత పోతాయి. దీని ఆకుపసరులో నిమ్మపండు పిండి, ఉడికించి దానిని కళ్ళ చుట్టూ పట్టు వేసుకుంటే కళ్ళ కలక, కళ్ళలో ఎరుపు, నీరు కారడం, నొప్పి పోతాయి. దీని జిగురును కొద్దిగా నేతిలో వేయించి, చూర్ణం చేసి తీసుకుంటే గుండెకు బలం, వీర్యవృద్ధి కలుగుతాయి.


**నల్లమందు:** ఈ నల్లమందు మంచిదయితే చేదుగా ఉంటుంది. మనోత్సాహాన్నిస్తుంది. బాగా మాట్లాడనిస్తుంది. కఫం, వాతం, అతిసారాలను హరిస్తుంది. నరాలకు సత్తువును కలుగజేసి బలాన్నిచ్చి రతిసౌఖ్యాన్ని రెట్టింపుజేస్తుంది. వంటినొప్పులను పోగొడుతుంది. క్షయ, వ్రణాలు, స్ఫోటకం, మూలవ్యాధిని పోగొడుతుంది. విరిగిన ఎముకలను అతుక్కునే టట్టు చేస్తుంది. అగ్నిదీప్తిని, జీర్ణశక్తిని కలుగజేస్తుంది. గాయాలను మాన్పి, నిద్రను కలుగజేస్తుంది. చలి జ్వరం కలిగిన వారికి చలిని తగ్గిస్తుంది. నాడి వేగాన్ని, శరీరంలో గల వేడిని హెచ్చిస్తుంది. బుద్ధిబలాన్నిస్తుంది. రక్తస్రావం, అతిమూత్ర రోగాలను అణచి వేస్తుంది. అతిగా తీసుకుంటే దురదలు పుడతాయి. రక్తంలో వేడి పుట్టి క్షీణిస్తారు. శరీరకాంతి పోతుంది. బుద్ధిబలం తగ్గిపోతుంది. గుండెలకు, కాలేయానికి తీరని నష్టం కలుగజేస్తుంది.

**నల్లమద్ది:** దీని చూర్ణం లేదా కషాయం వ్రణాలను ఆర్చి వేస్తుంది. కఫాన్ని, మల దోషాన్ని, పైత్యాన్ని హరిస్తుంది.



**నల్ల వంకాయ:** రుచిగా మనోహరంగా ఉంటుంది. కఫ పైత్యాలను అణచి వేస్తుంది. రుచిని పుట్టిస్తుంది. విరేచనాన్ని జారీ చేస్తుంది. అతిగా తింటే నేత్రరోగాలను కలుగజేస్తుంది.

**నారచీరె:** వాతాన్ని తగ్గిస్తుంది. చలి, ఎండల వలన కలిగే బాధలను అణచి వేస్తుంది. శుచిగా ఉంటుంది.



**నారింజ:** దీనిని దబ్బపండని కూడా వ్యవహరిస్తారు. చెట్టున పండినదయితే తియ్యగా ఉండి, చలవజేస్తుంది. పైత్యాన్ని హరిస్తుంది. మూత్రాన్ని జారీ చేసి పొట్టకు బలాన్నిస్తుంది. ఆకలి కలిగిస్తుంది. రక్తాన్ని శుభ్రపరుస్తుంది. పుల్లని పండయితే ఉష్ణతత్వం కలవారికి అనుకూలంగా ఉంటుంది. కమలాఫలం, బత్తాయి, తియ్య నిమ్మపండు, ఈడేపండు...ఇవన్నీ నారింజ జాతికే చెందుతాయి. వీటిలో ఏది తీసుకున్నా వెంటనే నీరు తాగరాదు. తాగితే పొట్ట పాడవుతుంది. నీళ్ళ విరేచనాలు అవుతాయి. జ్వరం వచ్చే అవకాశం ఉంది.

**నారింజ తొక్కలు:** నారింజ జాతికి చెందిన ఏ పండ్ల తొక్కలయినా సువాసన కలిగి చేదుగా ఉంటాయి. వీటి చూర్ణంగాని, కషాయంగాని తీసుకుంటే కడుపులోని వాతం పోతుంది. అగ్నిమాంద్యం, పైత్య జ్వరాలు కూడా పోతాయి.

–నీలకన్ఠాచార్య

**ప్రతివారం మీకోసం ప్రత్యేకం**